# నిస్సీ జయధ్వజము

విడి పత్రిక రూ 8/-

డిసెంబర్ - 2017 | క్రైస్తవ ఆధ్యాత్మిక మాస పత్రిక | సంవత్సరపు చందా రూ. 100/-


## క్రిస్మస్ పండగ ఎలా ఆచరించాలి?

ఈ 2017 సంవత్సరములో 11 నెలలు గడిచిపోయాయి. ఈ చివరి నెలలో అనగా డిసెంబర్ నెలలో మనము అడుగుపెట్టాము. డిసెంబర్ నెల అనగానే క్రైస్తవులందరికి జ్ఞాపకం వచ్చేది క్రిస్మస్ పండగ. ప్రపంచమంతా జరుపుకునే పండగ క్రిస్మస్ పండగ. కొన్ని పండుగలు కొన్ని దేశాలు కొన్నిపండుగలు కొన్ని ప్రాంతాలవారే జరుపుకుంటారు. కాని క్రిస్మస్ పండగ మాత్రం ప్రపంచమంతా ఆచరిస్తుంది. కారణం 2000 సం॥ క్రితమే మన యేసయ్య ప్రపంచ మానవాళి రక్షణార్ధమై పరలోకాన్ని విడిచి తన్నుతాను తగ్గించుకొని ఈ భూమిపైకి దిగివచ్చి కన్య మరియ గర్భమందు జన్మించాడు. అందుకే ప్రపంచమంతా క్రీస్తు జన్మదినాన్ని జరుపుకుంటుంది. ఆరోజు సెలవు దినంగా గుర్తించబడినది. అయితే పండుగ సమీపిస్తుంది దేవుని బిడ్డలు ఎలా పండగచేయాలి? అని దేవునిసన్నిధిలో నేను ప్రార్ధించినప్పుడు పరిశుద్ధాత్మ దేవుడు ఈ సందేశమును బయలుపరచినాడు.

పండగ చేయడం తప్పేమి కాదు కాని అది ఎలా చేయాలో క్రైస్తవునికి తెలియకపోవడం తప్పు. పాతనిబంధన కాలంలో చాలాపండుగలు ఉన్నాయి. ఒక్కరోజు పండగచేసారు, మూడుదినాలు పండగ చేసారు, నాలుగు దినాలు, ఏడుదినాలు ఇలా అనేక పండుగలు జరిగినట్లుగా లేఖనాలలో వ్రాయబడివుంది. పండగ ఆచరించండి, పండగ జరిగించండి.

అయితే క్రొత్తనిబంధన క్రైస్తవులు మాత్రం క్రిస్మస్ పండగ (క్రీస్తు జన్మించిన రోజు), ఈస్టర్ పండగ (యేసు ప్రభువు చనిపోయి తిరిగి లేచిన రోజు) ఈ రెండు పండుగలను ఎక్కువగా ఆచరిస్తున్నారు. వాటిలో క్రిస్మస్ పండగను చాలా ఘనంగా జరుపుకుంటారు.

అయితే ఈ పండగ ఎలా చేయాలని నేను మిమ్ములను అడిగితే దేవుని బిడ్డలైన మీరు అంటారేమో ఒక ఊయ్యాల తయారుచేసి, దానికి లైట్స్‌పెట్టి మినుకు్కమనే వస్త్రాలతో రంగురంగుల కాగితాలతో ఉయ్యాలను అలంకరించుదాం, దానిలో ఒక బొమ్మను పడుకోబెడదాం, నీవు జోలపాట పాడితే మీ వెనుక మేము జోలపాటపాడుతాం, మీరు ఊయల ఊపండి మేము ఊయ్యాల ఊపుతాము అని  లేదా ఒక పెద్దకేక్ తీసుకొని, ఒక క్రిస్మస్ ట్రీ తీసుకువచ్చి. ఆచెట్టుకు మెరుపులతో, లైట్స్‌తో అలంకరించి ఆ కేకును కట్‌చేస్తూ, క్రిస్మస్ వేషాలు వేసి అలా పండగ చేసుకుందాం అని సలహాను మీరు ఇవ్వవచ్చు! కాని పండగ అలా చేయకూడదని పరిశుద్ధగ్రంథం తెలియజేస్తుంది. ఆవిధంగా చేస్తే అది అన్యఆచారముగా చేసే పండుగ అవుతుంది.

ఎందుకంటే పరిశుద్ధగ్రంథంలో క్రిస్మస్ ట్రీలేదు, క్రిస్మస్ కేకులు లేవు, క్రిస్మస్ తాతయ్య అసలే లేడు. ఆవిధంగా చేసుకోడానికి వీలులేదు మరి ఎలా జరిగిద్దాము? ఇప్పుడు క్రైస్తవప్రపంచములో సంఘాలలో జరుగుతున్న పండగ ఏమిటి? ఉయ్యాల ఊపడం, జోలపాటపాడడం, చెట్టుకు లైట్స్‌పెట్టడం, పెద్దకేకులు కట్‌చేయడం, గ్రీటింగ్‌కార్డ్స్ పంచుకోవడం, కొత్తబట్టలు కొనడం, కట్టుకోవడం, బిర్యాని చేసుకోవడం. ఈరోజు ఈ విధంగా పండుగ జరుగుతుంది. ఆచారాలు పద్దతులు ఈవిధంగా ఉన్నాయి. మరి పండగ ఎలా చేద్దాము? పండగ అంటే ఏమిటి? క్రొత్తబట్టలు బిర్యాని బంధువులను పిలవడం, హోయిగా గంతులువేయడం, క్రీస్తు జననం సినిమాలు చూడడం, బీరు బ్రాంది త్రాగడం దీన్ని పండగ అంటారా? బైబిల్లో ఆవిధంగ పండుగచేయమని ఎక్కడైనా వ్రాసి ఉందా? తుచ్ఛమైన ఆచారాలమధ్యలో లోకసంబంధమైన వాటి మధ్యలో  ఈరోజు క్రైస్తవప్రపంచం సమయాన్ని గడుపుతూ ప్రభువును ధు:ఖపరుస్తున్నారు, ప్రభువు రాకడను మరచిపోతున్నారు. వీరే దర్శనంలేని క్రైస్తవులు.

అయితే యేసురక్తముచేత కడుగబడి, క్రొత్తనిబంధన సంఘమైన మనము,

క్రొత్తనిబంధన విశ్వాసులమైన మనము క్రిస్మస్‌పండగ ఏలా చేయాలనే విషయాలను ఈనాటి క్రైస్తవప్రపంచం తెలుసుకోవాలి. వాక్యానుసారంగా పండుగ చేస్తున్నామా? లేక మన ఇష్టానుసారంగా మనకు తోచినట్లుగా, మనకు తోచిన పద్ధతులలో క్రిస్మస్ ఆచరించడం ద్వారా ప్రభువును సంతోషపరుస్తున్నామా? దు:ఖపరుస్తున్నామా? అనే విషయాన్ని ఈరోజు దేవుని ప్రజలు తెలుసుకోవాలి.

అసలు పండగ అంటే ఏమిటి? ఎలా చేస్తే దాన్ని పండగ అంటారు? దాని అర్థం నీకు తెలియకపోతే నీవు  పండగ ఎలా చేస్తావు? ఏదో అందరు చేస్తున్నారు నేను చేస్తున్నానని గ్రుడ్డిగా పండగచేయడం పండగకాదు. పండగచేయవలసిన పద్ధతుల్లో చేయకపోతే అది ఆశీర్వాదం కాదు. నీకు పండగ చేయడం తెలియదంటే నీవు నామకార్థ అనుభవాల్లో బ్రతుకుతున్నావని అర్థం.

ప్రియమైన దేవుని బిడ్డలారా! పండగ ఆచరించాలి కాని ఆచారాలతో ఆచరింపకూడదు. అది యెహోవా పండగకాదు. అన్య ఆచారాల మధ్యలో అన్యపద్ధతుల మధ్యలో మనుష్యులు కల్పించినా విగ్రహాలమధ్యలో పండగ ఆచరింపకూడదు. పండగంటే ఆశీర్వాదం కాని శాపం కాదు. అన్య ఆచారాలతో కూడిన పండగచేస్తే దేవునికి కోపాన్ని తెప్పిస్తుంది నిన్ను తెగులు ఆవరిస్తుంది.

**అపో॥ పౌలు కొరింథి సంఘస్తులకు పత్రికవ్రాస్తూ ఈలాగున అంటున్నాడు...**

**"గనుక పాతదైన పులిపిండితో నైనను దుర్మార్గతయు దుష్టత్వమునను పులిపిండితోనైనను కాకుండా, నిష్కాపట్యమునను సత్యమునను పులియని రొట్టెతో పండుగ ఆచరింతము (1కొరింథి5:8)"**

పులియని రొట్టెతో పండగ ఆచరించుదాం. పులిసిన పిండితో పులిపిండితో కాకుండా పులియని రొట్టెతో పండగ ఆచరించుదాం. పులియని దానితో రొట్టెచేద్దాము, పులిసిన దానితో రొట్టె చేయకూడదు. అది పులియనిదై యుండాలి అంటే దాని అర్థమేమిటి?  పులిసిన పిండి పాపముతో పోల్చబడినది. పులిసిన పిండి అంటే దుర్మార్గత, దుష్టత్వము. దేవుని బిడ్డలు దుర్మార్గతతో, దుష్టత్వముతో పండగచేయకూడదు. నీ హృదయమంతా దుర్మార్గత దుష్టత్వం పెట్టుకొని పాపంలేని క్రీస్తు పండగను ఎలా ఆచరిస్తావు? పాపమెరుగని దేవుని పండగ చేయాలంటే నీవు ఏలా ఉండాలి? నిష్కపటముగా నిర్దోషముగా ఉండాలి.

చాలామంది క్రిస్మస్ పండగరాగానే నాకు చీరకొనివ్వలేదని భార్య,

పండగరోజు వంటకాలు రుచిగా లేవని భర్త, వారికి నచ్చిన ఫ్యాషన్ డిజైన్ బట్టలు కుట్టించలేదని పిల్లలు సణుగుతూ మేము చర్చికే రాము అని చిన్న చిన్న గొడవలు పడుతుంటారు. నన్ను అన్ని రకాలుగా చూసుకోలేదని అల్లుడు అలుగుతాడు. ఈ విధముగా దుష్టుడు క్రిస్మస్‌రోజు కుటుంబ సభ్యులమధ్యలో గొడవలుపెట్టి క్రిస్మస్‌రోజు కుటుంబాల్లో సంతోషం లేకుండా చేస్తున్నాడు. ఈలాంటికుటుంబాలు అనేకం వున్నాయి.

నీకు క్రొత్తబట్టలు ఉన్నాలేకపోయినా దేవునికి స్తోత్రం చెప్పండి. ఇది క్రొత్తబట్టలు కట్టుకొనే పండగా? భోజనాలు సిద్దం చేస్తేనే పండగా? దానిని మనస్సులోనుండి తొలగించుకుందాం. నిజమైన క్రైస్తవుడు అయితే లోక పాపముల నిమిత్తం నా యేసయ్య ఈలోకానికి దిగివచ్చాడని, ఆత్మల రక్షణార్ధమై ఆ రోజు ఉపవాసముండే ఆత్మల భారము కలిగిన క్రైస్తవులు వున్నారు. నా దేవుడు ఉన్నత స్థితి విడిచి దీనాతి దీనునిగా పశుల పాకలో నాకోసం జన్మించాడని ఆరోజు ఏది వున్నా లేకున్నా తగ్గించుకొని ప్రభువును ఆరాధించేవారు అనేకులు వున్నారు. అయితే నామకార్ధ భక్తి చేసే క్రైస్తవులే మాకు అదిలేదు ఇది లేదు అని గొడవలు సృష్టించుకుంటారు.

అయితే ఇంకా పసిపిల్లలవలె బ్రతకకుండా విశ్వాసములో, పరిశుద్ధతలో, ప్రార్ధనలో, వాక్యములో లోతైన అనుభవాల్లో ఎదిగిన క్రైస్తవునిగా జీవిద్దాం. నామకార్దులు గొడవపడినట్లుగా ఎందుకు గొడవ? ఎంతకాలం పసిపిల్లలవలె ఉంటారు? ఆత్మీయకంగా ఎదగండి. ఆచారాలు వదిలిపెట్టండి, పద్దతులు విడిచిపెట్టండి. ఆత్మతో సత్యముతో ఆరాధించే క్రమములోనికి రండి! ఈ 2017 సంవత్సరములో జరిగే క్రిస్మస్ పండుగను నిష్కపటంతో, ఆత్మతో సత్యముతో, వాక్యానుసారమైన పద్దతులలో మనం పండగ ఆచరించుదాం.

ఏమిటి ఆపద్దతులు? చాలామంది గ్రుడ్డిగా పండగచేస్తుంటారు. ప్రభురాకడ దినాలు ఆసన్నమవుతున్నాయి. పండగ వాక్యానుసారమైన పద్దతుల్లో చేయాలి. మీ గుండెల్లో యేసులేడు, నీ హృదయంలో యేసులేడు, పండగేమో ప్రభువుది దానిని పండగ అంటారా? మొదట యేసయ్యను గుండెల్లోకి చేర్చుకో, నీ హృదయంలో నిజముగా యేసయ్యను చేర్చుకుంటే నీకు రోజూ ఒక పండగే. బిర్యాని తిన్నాపండగే ఉపవాసము ఉన్నా పండగే, నిందలైనా,కరువైనా, ఖడ్గమైన, ఉపద్రవమైనా,

పంటపండినా, పండకపోయినా ఏదిఏమైనా యేసయ్య నీ హృదయంలో ఉంటే నీకు ప్రతిరోజూ పండగే. ఇంటిమీద స్టార్ పెడితేనే పండగా? యేసయ్యమన గుండెల్లో ఉండాలి. ఆయన మనలో నివాసం చేయాలి.

యేసయ్య జన్మించగానే మొదట పండగ ఎవరు చేసారు? దేవదూతలు ఆ పండుగ చేసాయి. పాటలుపాడి, స్తుతించి, కొనియాడి, ఘనపరచి, సర్వోన్నతమైన స్థలములలో దేవునికి మహిమ ఆయనకు ఇష్టులైన మనుష్యులకు భూమిమీద సమాధానము కలుగును గాక! అని కొనియాడారు. పండగ అనగా బిర్యానికాదు, బట్టలుకాదు, షికార్లుకాదు, కేకులు కాదు ఆయనను ఆరాధించడమే నిజమైన పండగ.

యేసయ్య 33 1/2 సం॥ భూమి మీద జీవించాడు. జీవించినప్పుడు పాతనిబంధన క్రమం ప్రకారంగా కొన్నిపండుగలు ఆదినాలలో జరిగాయి. పాతనిబంధన పండుగల రోజు యేసయ్య ఏమి చేసాడు? మనము ఏమి చేయాలి అని కొన్ని విషయాలను ధ్యానించుదాం.

**"యూదుల పస్కా పండుగ సమీపింపగా యేసు యెరూషలేమునకు వెళ్ళి దేవాలయములో ఎడ్లను గొఱ్ఱెలను పావురములను అమ్మువారును రూకలు మార్చువారును కూర్చుండుటచూచి త్రాళ్ళతో కొరడాలు చేసి గొఱ్ఱెలను ఎడ్లనన్నిటిని దేవాలయములోనుండి తోలివేసి, రూకలు మార్చువారి రూకలు చల్లివేసి, వారి బల్లలు పడద్రోసి పావురములు అమ్ము వారితో వీటిని ఇక్కడ నుండి తీసికొనిపొండి, నాతండ్రియిల్లు వ్యాపారపుటిల్లుగా చేయకూడని చెప్పెను (యోహాను2:13)".**

యేసుప్రభువు జీవిస్తున్నప్పుడు పస్కాఅను ఒక పండుగవచ్చింది. ఆ పండగరోజు యేసుప్రభువు దేవాలయానికి వెళ్ళాడు. సాధారణంగా పండగరోజు చాలామంది తమ భార్యను ఇంటిదగ్గర వదిలిపెట్టి నేను వచ్చేవరకు అన్ని స్వీట్స్, బిర్యానీలు రెడిచేసి పెట్టు, నేను పిల్లలం కలిసి చర్చికివెళ్ళి యేసయ్యకు జోలపాటపాడి వస్తాం. నీవు పిండివంటలన్ని సిద్ధంచేసి పెట్టు అని అంటారు. ఆమె మంచి ఆత్మీయురాలైతే నీవు చర్చికి వెళ్తావు నేను వంటచేయాలా? నేను కూడా చర్చికివస్తాను, నేనుకూడ ఆరాధన చేసి వర్తమానం వింటాను అని వంటలన్ని ప్రక్కనపెట్టి భర్తతోపాటు చర్చికి వెళ్తుంది. అంటే పండుగరోజు కుటుంబ సమేతంగా మందిరానికి వెళ్ళాలి.

చూడండి పండగరోజున యేసుప్రభు దేవాలయానికి వెళ్ళి దేవాలయంలో జరుగుతున్న అపవిత్రమైన కార్యములను చూసి దేవాలయాన్ని శుద్ధీకరించడం ప్రారంభించాడు. దేవాలయములో వ్యాపారం చేసేవాన్ని, అపవిత్రమైన కార్యాలను చేసేవారిని వెళ్ళగొట్టి దేవాలయాన్ని శుద్ధీకరిస్తున్నాడు. సాధారణంగా పండగరోజు ఇంటివద్ద వుండి, చక్కగా వస్త్రాలు ధరించి, పిండివంటలు ఫలహారాలు చేసుకొని హాయిగా యేసుప్రభువు పండుగ చేసుకోవాలి కాని యేసుప్రభు మందిరానికి వెళ్ళి మందిరములో పని కల్పించుకున్నాడు. ఆలోచించారా? బ్రతికే దినాలన్ని సద్వినియోగం చేసుకొనండి. దేవుని దృష్టిలో ఈ జీవితం లెక్కకు రాదు. క్షణబంగురమైన జీవితాన్ని సద్వినియోగం చేసుకున్నవాడే నిజమైన క్రైస్తవుడు.

యేసుప్రభువు మందిరానికి వెళ్ళి శుద్ధీకరించాడు. మందిరానికి వచ్చిన మనం మనలను మనము శుద్ధీకరించుకోవాలి. నా పాపముల ప్రాయశ్చిత్తం కొరకు నీ రాజ్యములో నన్ను చేర్చుటకై నా కోసం సింహాసనం విడిచి మీరు ఈలోకంలో జన్మించారు. నాకోసం సిలువలో రక్తమంతా కార్చారు. అని ఆయన తగ్గింపును ఆయన త్యాగాన్ని తలంచుకొని మనలను మనము పరిశీలించుకొని, పరిశుద్ధపరచుకొని, శుద్ధీకరించుకొని ఆయన బిడ్డలుగా మారుదాం. పండగరోజు యేసుప్రభువు ఇంటివద్దలేడు. వారితో వీరితో నవ్వుతూ లేడు. ఏదో సినిమాలు చూస్తులేడు, బంధువులతో, స్నేహితులతో కలిసి బీరు షాపులో లేడు ఆయన మందిరానికి వెళ్ళి మందిరాన్ని శుద్ధీకరించాడు. మనజీవితములను మనము శుద్ధీకరించుకోవాలి.

ఈనాడు చర్చిల్లో, ఇల్లల్లో బూజుదులిపి రంగులు వేసి మట్టి గోడలను శుద్ధీకరించి, అందమైన రంగు కాగితాలతో మెరుపులతో అలంకరిస్తున్నారే కాని హృదయాన్ని శుద్ధీకరించుకొని హృదయాన్ని ఆత్మీయంగా అలంకరించుకోవడం లేదు. పాపములో ఉండి పండగచేస్తే నీకది ఆశీర్వాదమా? శాపమా? అలాంటి పండగ చేయకూడదు. శుద్ధీకరించుకునే పండగ చేయుదము. తుచ్చమైన ఆచారాలమధ్యలో పద్దతులమధ్యలో కాలయాపన చేసి జీవితాన్ని శాపంగా మార్చుకోకుండా, ఒక నిజమైన పండగ చేయాలి. దేవాలయమనే హృదయాన్ని చక్కపరచుకో, నీ జీవితాన్ని శుద్ధీకరించుకో, ఒక పవిత్రమైన ఆలయాన్ని ప్రభుకొరకై నిర్మించు. ఇది ఒక దినములో పూర్తి అయ్యేది కాదు. జీవితాంతం ఆలయాన్ని

కడుతూనే ఉండాలి. ప్రతి ఆదివారం మందిరానికి వచ్చి ఆలయాన్ని కట్టుకోవాలి.

**"అటు తరువాత యూదుల పండుగ యొకటి వచ్చెను గనుక యేసు యెరూషలేమునకు వెళ్లెను..... యేసు నీవు లేచి నీ పరుపెత్తికొని నడువుమని వానితో చెప్పగా వెంటనేవాడు స్వస్థతనొంది తన పరుపెత్తికొని నడిచెను(యోహాను 5:1-8)".**

పండగరోజు యేసుప్రభువు యెరుషలేములో ఉన్న బెతెస్థకోనేరు దగ్గరకు వెళ్ళాడు. ఇక్కడ 38 సం॥లనుండి వ్యాధిగ్రస్తుడైన ఒకవ్యక్తి బెతెస్థ కోనేరు దగ్గర ఉన్నాడు. దేవదూతవచ్చి నీళ్లను కదిలిస్తుంది. ఎవరైతే ఆ నీళ్లలో మొదట దిగుతారో వారు ఎంత భయంకరమైన వ్యాధిగ్రస్తులైన బాగుపడ్తారు. అయితే ఎప్పుడు దిగాలి? దేవదూత నీళ్లను కదిలించినప్పుడు అందరికంటే ముందుగా దిగాలి. 38సం॥లనుండి ఒక వ్యక్తి అక్కడే ఉన్నాడు. కారణం దేవదూత కదిలించినప్పుడు ఈయనకంటే ముందుగా ఎవరో ఒకరు నీళ్లలో దుమికి బాగయ్యేవారు. ఈయన మాత్రం ఆలాగే పక్షవాతరోగం కలిగి ఉన్నాడు.

పండగ దినమున యేసుప్రభువు అక్కడికి వచ్చి అతనిని స్వస్థపరిచాడు. పండగ దినమున యేసుప్రభువు పండగచేసుకుంటూ ఇంటివద్ద ఉన్నాడా? రోగులను స్వస్థపరచుటకు బయటకు వచ్చాడా? ఇంట్లో లేడు బయటికి వెళ్లి ఆత్మలపట్ల భారంకలిగినవాడై రోగులకు స్వస్థతప్రార్థనలు చేస్తున్నాడు.

క్రిస్మస్‌రోజు నీ పండగ హడావిడిలో నీవు ఉన్నావు కాని ఎవరికైనా సువార్త ప్రకటించావా? ఎవరికొరకైనా ఉపవాసం ఉన్నావా? ఎవరైనా పేదవారికి అన్నం పెట్టావా? దుస్తులు ఇచ్చావా? లేక నీవే బిర్యానితింటూ, బీరుత్రాగుతూ, సూటుబూట్లు పట్టుచీరలతో పండగరోజు మెరిసిపోతున్నావా? తిండికి బట్టకు అలంకరణకు ఖర్చుపెట్టకండి. ఎంతోమంది ఆకలితో అలమటిస్తున్నారు. ఒక్కపూటకూడా కడుపునిండా భోజనం దొరకని నిరుపేదలు అనేకులున్నారు. కట్టుకోడానికి సరియైన వస్త్రాలు లేనివారెందరో మనకళ్లముందు, వీదుల్లో కన్పిస్తారు. ప్రియమైన దేవుని బిడ్డలారా, ఆయన పండగరోజు స్వస్థతప్రార్థనలు చేస్తున్నాడు. అనారోగ్యంతో ఉన్నవారిని బాగుచేస్తున్నాడు. ఈ విధంగా చేయడం పండగ అనిఅంటారు. పండగ అంటే శుద్ధీకరించుకోవడం, బలహీనులకోసం ప్రార్థించడం, రోగాలతో బాధపడ్తున్నవారికొరకు ఉపవాసం ఉండటం, పట్టణము కొరకై ప్రార్థించడం దిక్కులేని అనాధలకు విధవరాండ్రకు సహాయం చేసి

ఆదుకోవడం ఇది నిజమైన క్రిస్మస్ పండుగ.

**"సగము పండుగైనప్పుడు యేసు దేవాలయములోనికి వెళ్ళి బోధించుచుండెను. యూదులు అందుకు ఆశ్చర్యపడి చదువుకొనని ఇతనికి ఈ పాండిత్యమెట్లు వచ్చెనని చెప్పుకొనిరి (యోహాను 7:14)".**

పండగ దినమున యేసుప్రభువు బోధిస్తున్నాడు, సువార్తను ప్రకటిస్తున్నాడు. పండగరోజు మీ బంధువులందరిని పిలవండి. మీతోపాటు మందిరానికి తీసుకురండి, వారు సువార్త వింటారు, దైవజనులు వారి నిమిత్తమై ప్రార్థన చేస్తారు. అంతే కాదు వారికి చక్కని భోజనాన్ని పెట్టి వారికి సువార్తను, మీసాక్ష్యాన్ని పంచుకోండి, దేవుడు మీ జీవితములో చేసిన కార్యాలను తెలియపరచి, బలపరచి వారిని గృహాలకు పంపండి. 10మందిలో ఒక్క ఆత్మయైన రక్షింపబడుతుంది. వాక్యం జీవము కలిగినది, వారిలో నాటబడిన వాక్యం ఈరోజు కాకపోయినా రేపు అయినా క్రియచేస్తుంది. యేసుప్రభువే ఇలాంటి కార్యాలు చేస్తే యేసయ్యపండగచేస్తున్న మనమేమి చేయాలి? యేసయ్యచేసినట్లుగా చేయాలి.

**"కాబట్టి ఆయన ఈలోకమందు ప్రవేశించునప్పుడు ఈలాగు చెప్పుచున్నాడు. బలియు అర్పణయు నీవు కోరలేదుగాని నాకొక శరీరమును అమర్చితివి. పూర్ణహోమములును పాపపరిహారార్ధ బలులును నీకిష్టమైనవి కావు. అప్పుడు నేను గ్రంథపు చుట్టలో నన్నుగూర్చి వ్రాయబడిన ప్రకారము దేవా నీచిత్తము నెరవేర్చుటకు ఇదిగో నేను వచ్చియున్నానంటిని (హెబ్రీ10:5)".**

యేసుప్రభువు అంటున్నాడు నీవు నాకొక శరీరమును అమర్చితివి. ఈ శరీరం ఎందుకు? ఇష్టమైనట్లుగా అలంకరించుకోడానికా? దేవుని ప్రజలము, పరిశుద్ధ జనాంగము, చీకటిలోనుండి విడిపింపబడినవారము, తుచ్ఛమైన ఆశలు నెరవేర్చుకోడానికా? కాదు ఈ దేహం నీ చిత్తంచేయడానికే నాకిచ్చావు అని అంటున్నాడు.

ఆలోచించండి! అపవిత్రమైన కోరికలు నెరవేర్చుకోడానికి దేవుడు ఈ దేహమును ఇవ్వలేదు. దైవచిత్తం ఈ దేహములో నెరవేరుటకొరకు మనకొక దేహాన్ని ఇచ్చాడు. ఈ దేహము నీ సొత్తుకాదు. ఈ దేహాన్ని దైవచిత్తం చేయడానికి ఎప్పుడు అప్పగించుకుంటావో అప్పుడే నిజమైన పండగ, దైవచిత్తం చేయడమే నీకు సంతోషం, దైవచిత్తం చేయడమే నీకు నిజమైన పండగ. ఇలాంటి

పండగను ఆచరిద్దాం. నిష్కపటంగా, పరిశుద్ధంగా, యధార్థంగా, వాక్యానుసారంగా అచరించుదాం. దైవచిత్తం శరీరములో నెరవేర్చుదాం.

అందుకే వాక్యానుసారమైన పండగచేయాలి. పండుగ అనగానే సాధారణంగా మనకు జ్ఞాపకం వచ్చేది క్రొత్తబట్టలు పిండివంటలు, బిర్యానీ, బట్టల సంతోషం పండుగా?కాదు. మీకు సంతోషం ఒక్కరోజు మాత్రమే కావాలా? లేకజీవితాంతం కావాలా? జీవితాంతం మీకు సంతోషం అవసరం. ఈలోకంలో సంతోషం పరలోకంలో సంతోషం ఎప్పుడు నీ జీవితములో సంతోషం నిలిచివుండే పండగనీవు ఆచరించాలి. యేసయ్య దానినే కోరుతున్నాడు. ఆ పండగ నీవు జరిగించాలని ప్రభువు ఆశపడుతున్నాడు. ఆ సంతోషం నీకు ఎలా వస్తుందో తెలుసా? నీ హృదయంలో నుండి పాపాన్ని ధుర్మార్గాన్ని దుష్టత్వాన్ని తొలగించుకొని నీహృదయమనే తలుపుతీసి, యేసయ్యను స్వంతరక్షకునిగా చేర్చుకొని ఆ యేసయ్యను ఆత్మతోను సత్యముతోను ఆరాధించిన రోజు నిత్య సంతోషాన్ని నీవు అనుభవిస్తావు. కరువైనా, ఖడ్గమైనా, శ్రమయైనా, నిందయైనా, ఉపద్రవమే ఎదురైనా ఈ సంతోషాన్ని జీవితకాలమంతా అనుభవిస్తావు. నిజమైన పండగను ఆచరించి నిత్యసంతోషాన్ని పొందుకుందాము. అన్య ఆచారాలు, పద్ధతులతో కూడిన పండగను విడిచిపెడదాం. ఆత్మతో సత్యముతో ఆరాధించడం ద్వారా కలిగే సంతోషంతో కూడిన పండగ ఆచరిద్దాం.

1. హృదయములో వున్న పాపాన్ని, దుర్మార్గాన్ని, దుష్టత్వాన్ని విడిచి పండగ చేద్దాం. ఇంటికి ఒంటికి పట్టిన దుమ్ము మాత్రమే దులుపుకోకుండా హృదయానికి అంటిన పాపాన్ని శుద్ధీకరించుకొని నిష్కాపట్యముతో పండగ చేద్దాము. 2. దేవదూతలు, గొల్లలు, జ్ఞానులు ఆరాధించినట్లుగా మనము ఆత్మతో సత్యముతో ఆరాధించే పండగ చేద్దాము. 3. ఈ పండగ రోజు తింటూ త్రాగుతూ కూర్చోకుండా నలుగురికి సువార్త ప్రకటించి రోగుల కొరకు ప్రార్ధన చేద్దాం. ఆత్మల రక్షణార్ధమై భారముతో ఉపవాస ప్రార్థన చేద్దాం. 4. దేవుడు ఇచ్చిన దేహాన్ని ఈ లోక వస్తువులతో అలంకరించుకోకుండా మన దేహము ద్వారా దేవుని చిత్తాన్ని నెరవేర్చి పండుగ ఆచరిద్దాము. ఇదే నిజమైన క్రిస్మస్. అలాంటి ఆత్మతోసత్యముతో కూడిన పండగచేయడానికి దైవకృప మీకు తోడైయుండునుగాక...

దేవుడు మిమ్ములను దీవించునుగాక..... ఆమెన్

ప్రార్థించండి! పాల్గొనండి!! దేవునిచేత దీవించబడండి !!!

# క్రిస్మస్ వేడుకలు

తేదీలు: 2017 డిసెంబర్ 26వ తేదీనుండి 2018 జనవరి 1వ తేదీవరకు

ముఖ్య ప్రసంగీకులు

# పరిశుద్ధాత్మ దేవుడు

అందరికి ప్రేమపూర్వక ఆహ్వానము

**వివరములకు,** నిస్సీ మినిస్ట్రీస్, నిర్మల్, 9390011485, 7702348500

**ప్రార్థనా అంశములు**

*ఆశీర్వాదకరంగా జరుగునట్లు
*బలమైన వర్తమానాలకొరకు
*మంచి వాతావరణం కొరకు
*దైవజనుల ఆరోగ్యం కొరకు
*ఉజ్జీవం కొరకు
*అవసరతలు తీరునట్లు

# సేవకుల సదస్సు

ప్రతి నెల మూడవ సోమవారము

నిస్సీ ప్రార్దనా మందిరము (నిర్మల్) లో జరుగుతుంది

**దైవ సేవకులందరికి మా ప్రేమపూర్వక ఆహ్వానము**

సమయం : ఉదయం 10 గం॥నుండి మధ్యాహ్నం 2 గం॥ల వరకు

**గమనిక**

- **ఈపత్రిక మీకు ఆశీర్వాదకరముగా ఉన్నట్లయితే ఇతరులకు పరిచయం చేయండి.**
- **మీ అడ్రస్‌ను ఈ మొబైల్ నంబర్‌కు 9390011485 - S.M.S చేసినచో మీకు పత్రిక పంపించబడును.**
- **లేదా మీ ఈమేయిల్ ఐడి (E Mail ID) పంపినచో మీకు మేయిల్ చేయబడును.**

ఈ పరిచర్య నిమిత్తం కానుకలను, చెక్కులను, డిడిలను ఈ అడ్రస్సుకు పంపగలరు

M.Jayaraju
SBI-Bank Branch: Nirmal
A/c No: 31665876753 IFSC Code: SBIN0006405

# నిస్సీ

## పాటల సి.డి.లు

1. నా దాగుచోటు నీవే
2. మహోఘనుడా
3. ఇంపైన సువాసన
4. కృతజ్ఞతార్పణలు
5. నా గమ్యము నూతన యెరుషలేము
6. ఇశ్రాయేలు దేవా
7. స్తోత్రార్పణ NEW

## మా పుస్తక ప్రచురణలు

1. క్రైస్తవ కుటుంబం
2. నిస్సీ వర్తమానాలు
3. బ్రతుకు బ్రతుకుగా మారుట

## విసిడిలు మరియు డివిడిలు

1. నేను మీకు క్షేమము కలుగజేసెదను
2. మలిన వస్త్రాలు
3. నాకు దీవెన దయచేయుము
4. నీ సూర్యుడికను అస్తమింపడు
5. ధైర్యము తెచ్చుకొనుము
6. నిరీక్షణ
7. నిన్ను నడిపించును
8. సౌందర్యము
9. ఐక్యత
10. ఆలోచన
11. సిలువను మోయుట
12. జయించిన వారికి ఆశీర్వాదము
13. దేవుని ఆత్మను నెమ్మది పరచుట
14. పైకి లేపు వాడు
15. షిత్తీము లోయ 1
16. షిత్తీము లోయ 2
17. యాకోబులో వంకరతనము లేదు
18. యాకోబు
19. బలవంతులుగా మార్చే దేవుడు
20. మీరు దేవుని వ్యవసాయమునైయున్నారు

## పసంగముల ఆడియో సి.డి.లు

1. పాపములో మరణించుట
2. పరిశుద్ధత గుర్చి దర్శనము
3. రమ్యమైన గుడారము
4. దహించు అగ్ని
5. ఆమె దీపము ఆరిపోదు
6. బలవంతుని చేతిలో
7. నా క్షేమానికి ఆధారం
8. నీవేమి ధరించితివి
9. పక్షి రాజు
10. అగ్ని జ్వాలలు
11. దీన మనస్సు తో చేసిన ప్రార్ధన
12. దైవ నడిపింపు
13. అంజూరపు చెట్టు
14. పరలోకపు అగ్ని , పాతాళపు అగ్ని
15. కలత చెందనివాడు
16. ఉధ్యానవనము
17. సిద్ధపాటు
18. క్షయభీజము అక్షయ భీజము
19. ఎండిన ఎడారిలో లేతమొక్క
20. గోపురము
21. జయము మనదే
22. లెబనోను సౌంధర్యం
23. దైవజనుని మాట వినుట

పాటల సి.డి ఒక్కటి 50రూ॥. ప్రసంగములు ఒక్కటి 30రూ॥ విసిడి, డివిడి ఒక్కటి 50రూ॥లు కావలసినవారు పోస్టు ద్వారా మనియార్డరు పంపి వీటిని పొందగలరు. పోస్టల్‌చార్జీలు అదనం.

మా అడ్రస్ ...

**Nissi Ministries, H.No. 1-3-132/A6**
**ShastriNagar, Nirmal-dist. 504106**
**Phone:08734-240147, 9390011485**

Regd. of Newspaper of India
TELTEL/2015/60909

Regd. No. ADB/012/2017-19
License to post on concessional rates

Printed matter

To,

# నిస్సీ మినిస్ట్రీస్

శాస్త్రీనగర్, నిర్మల్ 504106

ఫోన్ : 08734-240147, 9390011485
Website: www.nissiministries.co.in
Email ID: nissi.jayadwajamu@gmail.com

Published By: M. Priyadarshini W/o M. jayaraj, H.No. 1-3-132/A6
Shastrinagar, Nirmal Dist. Pin: 504 106

Edited & Owned by: Pastor. M. Jayaraj, H.No. 1-3-132/A6
Shastrinagar, Nirmal Dist. Pin: 504 106

Printed at: Nissi Printing Press, Shastrinagar, Nirmal